## పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి



**ప్రజాపక్షం/చందుర్తి :** విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక ఎస్సై రమేష్ ఆధ్వర్యం లో విద్యార్థులతో కలిసి మండల కేంద్రం లోని ప్రధాన కూడళ్ళ వెంట సైకిల్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ సమాజం లో శాంతి భద్రతల రక్షణ లో పోలీసుల పాత్ర ప్రత్యేకమైనదని అన్నారు.సొంత కుటుంబాలను వదిలి సమాజమే కుటుంబ విధులు నిర్వహించే పోలీసులు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు.అసాంఘీక శక్తులతో పోరాడి అసువులు బాసిన పోలీసు అమరులను స్మరించు కుంటూ వారి కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 28 అక్టోబరు, 2025 | పేజీలు :08


# వంతెన పునః నిర్మాణానికి మోక్షమెప్పుడో?

**రూ. 47 కోట్ల 40 లక్షల పిఎల్ఏఎన్ నిధులు కేటాయింపు**

**9 సంవత్సరాల క్రితమే వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**నేటికీ పిల్లర్ల దశలోనే వంతెన నిర్మాణ పనులు**

**మంత్రిగారు మా వంతెన నిర్మాణ పూర్తి చేయండి..!**

**ప్రజాపక్షం/ముత్తారం:** నేటికీ 9 సంవత్సరాల రెండు నెలల 22 రోజులు అయినప్పటికీ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ మానేరు వంతెన నిర్మాణ పనులు మాత్రం పిల్లర్ల దశలోనే ఉండడంతో ఇరు జిల్లాల ప్రజల కల నెరవేరకుండా పోతుంది. ఈ వంతెన నిర్మాణ పనులను ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మాణ పనులు పూర్తి చేయండి అంటూ రెండు జిల్లాల ప్రజలు మంత్రిని వేడుకుంటున్నారు.అయితే గతంలోపెద్దపల్లి జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను కలిపే పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ మానేరు వాగుపై ఏప్రిల్ 4వ తేదీ 2016 సంవత్సరంలో అప్పటి మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఈటెల రాజేందర్, శాసన సభ అధ్యక్షులు, మధుసూదన చారి, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, మంథని ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తోపాటు తదితరుల ఆధ్వర్యంలో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఆనాటి నుండి నేటి వరకు 9 సంవత్సరాల రెండు నెలల 23 రోజులు గడుస్తున్నప్పటికీ కూడా వంతెన నిర్మాణ పనులు కేవలం పిల్లర్ల దశలోనే ఉండడం గమనార్హం.ఆనాటి టిఆర్ఎస్ పాలనలో నత్తనడకన జరిగిన పనులు ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పూర్తి అయితాయి అనుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పెద్దపెల్లి జిల్లాల ప్రజల కల నెరవేరకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉండడంతో ఇరు జిల్లాల ప్రజలు అధికార యంత్రాంగంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేకమైన ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.అయితే భూమి పూజ చేసి దాదాపుగా 9 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు పునః ప్రారంభం కాకపోవడం తో ప్రజల ఆకాంక్ష నెరవేరడంలేదు.





**గతంలో కూలిన వంతెన నిర్మాణ గడ్డార్లు :** అసలే నిర్మాణ పనులు జరగక 9 సంవత్సరాల రెండు నెలలు గడుస్తున్నప్పటికీ వంతెన నిర్మాణానికి సంబంధించిన పిల్లర్ల పైన ఉన్న గడ్డార్లు సపోర్టులు ఒకవైపు వంగిపోవడంతో గతంలో కురిసిన ఈదురుగాలుల భారీ వర్షాలకు సుమారుగా 9 గడ్డార్లు రెండు సార్లు కూలిపోవడం జరిగింది. అదృష్టవశాత్తు వంతెన నిర్మాణానికి సంబంధించిన గడ్డార్లు కింద పడ్డ సమయంలో ఇలాంటి ప్రమాదం జరగలేదు. అయితే మానేరు వంతెన గడ్డార్లు కూలిపోయిన విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు వంతెన నిర్మాణ పనులు పరిశీలించి నాణ్యత లోపం లేదని కేవలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్ లైసెన్సును రద్దుచేసి కొత్తవారికి పనులు అప్పగించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. గత కొద్ది నెలల క్రితమే కొత్త కాంట్రాక్టర్లకు మానేరు సంబంధించిన వంతెన నిర్మాణ పనులు అప్పగించారు. అయినా కూడా నేటి వరకు పనులు మాత్రం ప్రారంభించకపోగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది.ఇప్పటికైనా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొనిఆలస్యం చేయకుండా త్వరితగతిన వంతెన నిర్మాణ పనులు పునఃప్రారంభం చేసి పనులు పూర్తి చేసి ఇరు జిల్లాల ప్రజల కల సాకారం చేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

# మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా

**మైనర్లకు లిక్కర్ విక్రయించవద్దు**

**నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలి**

**ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ స్పష్టం చేశారు. జిల్లాలో 2025 2027 సంవత్సరం వరకు కొనసాగనున్న మద్యం షాపుల టెండర్ల ఓపెన్ డ్రా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో మొత్తం 48 దుకాణాలు ఉన్నాయని, వాటిలో గౌడ్లకు 9, ఎస్సీ లకు 5 రిజర్వేషన్ ప్రకారం కేటాయించామని వెల్లడించారు. సెప్టెంబర్ 26వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్లు స్వీకరణ మొదలుపెట్టామని, దరఖాస్తులు ఈ నెల(అక్టోబర్) 23వ తేదీ వరకు స్వీకరించామని తెలిపారు. మొత్తం దరఖాస్తులు 1381 వచ్చాయని వెల్లడించారు. డిసెంబర్ 01 వ తేదీ నుంచి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి రాధాకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐలు శ్రీనివాస్, రాజేశ్వర్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### డ్రగ్స్ రహిత సమాజం కోసం

# సంఘటితంగా పోరాడాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు సంఘటితంగా పోరాటం చేయాలని, భవిష్యత్ తరాలకు డ్రగ్స్ మహమ్మారి నుండి విముక్తి కలిగించాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి (డిఎల్ఎస్ఏ) స్వప్నారాణి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా నశాముక్త్ భారత్ అభియాన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల ఆద్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించేలా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు డ్రగ్స్ మూలంగా సమాజంలో కోల్పోతున్న జీవితాలకు అద్దం పట్టేవిదంగా వేసిన రంగవళ్ళులు చూపరులను అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్య అధితిగా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి (డిఎల్ఎస్ఏ) స్వప్నారాణి హాజరై మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన చేసుకోవాలని సూచించారు. పిల్లలను బాగా చదివించాలని, వారిపై వారు చేసే పనులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించి చెడు వ్యసనాలకు లోను కాకుండా చూడాలన్నారు. పిల్లలతో స్నేహ పూర్వకంగా ఉంటూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్లపై సూచనలు చేశారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ భూతాన్ని కూకటి వేళ్ళతో పెకిలించి భావితరాలకు మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ స్పెషలిస్ట్ సుచరిత మెప్మా ఇన్చార్జి టిఎంసి స్వప్నతో పాటు మెప్మా మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/గంగాధర:** గత పదిహేను రోజులుగా నిర్వహించిన గంగాధర ప్రీమియర్ లీగ్ సీజన్ 7 సోమవారంతో ముగిసింది. ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో సోమవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. శ్రీహరి సోల్జర్స్, విక్రమ్ వైల్డ్ ప్రశాంత్ ఫైర్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీహరి టీం విజేతగా నిలిచి మొదటి బహుమతిగా రూ.30 వేలు, ట్రోఫీ అందుకుంది. రెండవ బహుమతి విక్రమ్ వైల్డ్ ప్రశాంత్ ఫైర్స్ రూ.15వేలు, ట్రోఫీ అందుకుంది. మూడవ బహుమతి ఆదిపెల్లి బ్రదర్స్ రూ.7500,



ట్రోఫీ, నాలుగో బహుమతి రాగూర్ కింగ్స్ రూ.7500, ట్రోఫీ గెలుపొందారు. గెలుపొందిన జట్లకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై వంశీకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఒడ్నాల యగ్నేష్‌కు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు కముటం శ్రీనివాస్, ఆముదాల రోహిత్, రొండ్ల అనిల్‌రెడ్డి, ఒడ్నాల వంశీకృష్ణ, రాగూర్, ఉపేందర్, లవకుమార్, ప్రణయ్, ఉప్పు ప్రశాంత్, జంగిలి రమేష్, రాకేష్, హరికిషన్, సత్యం, రవి, హరిబాబు, శ్రీనివాస్, హర్షరాజు, ముకుంద హాస్పిటల్, ఆర్య హాస్పిటల్ యజమాని, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో దొంగలు పడ్డారు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** పాఠశాలలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలలో దొంగలు పడ్డారు. బీరువా తెరిచి చూస్తే పుస్తకాలు తప్ప ఎత్తుకెళ్లేందుకు ఏమీ దొరకలేదు. దీంతో ఆగ్రహించిన దుండగులు పిల్లల పుస్తకాలు చిందరవందరగా పారేశారు. ఏం ఎత్తుకుపోవాలో తెలియక చిన్నపిల్లల ఆట వస్తువులు తీసుకుపోయారు. సోమవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు విషయాన్ని ఎంఈవో రవీందర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయురాలు జానకిదేవిలు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## సైకిల్ ర్యాలీని విజయవంతం చేయాలి: ఎస్సై రవికుమార్

**ప్రజాపక్షం/ముత్తారం:** పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా ముత్తారం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఇదులపూర్, పోతారం, సర్వారం, లక్కారం, మచ్చుపేట మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సైకిల్ ర్యాలీలో కార్యక్రమంలో పాల్గొనే యువకులు ఇదులపూర్ క్రాస్ రోడ్డు వద్దకు మంగళవారం ఉదయం 8గంటలకు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.

## నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు: ఎస్ఐ

**ప్రజాపక్షం/ముత్తారం:** ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ముత్తారం ఎస్సై రవికుమార్ అన్నారు.ఆదివారం ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ బస్టాండ్ ఆవరణంలో మిర్చి వ్యాపారులు మారం శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, గాదం శ్రీనివాస్, రాజు మరికొందరు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో సీసీ కెమెరాలు అందుబాటులోని వస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు, అసాంఘికకార్యకలాపాలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చి గుర్తు తెలియని వ్యక్తులు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎవరు లేని ఇంట్లో, రోడ్లపై వెళ్తున్న మహిళల మెడలోని బంగారు ఆభరణాలు దొంగతనాలు చేస్తున్న కారణంగా నేరాల నియంత్రణ కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కాగా ఇటీవలే ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎస్సై కోరారు.

## గుత్తేదారు నిర్లక్ష్యం.. ప్రజలకు తిప్పలు....



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తాసిల్దార్ భవన నిర్మాణ పనుల్లో గుత్తేదారు నిర్లక్ష్యం చూపడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తలెత్తుతున్న పట్టించుకోవడం లేదని అవార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముత్తారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన తహసిల్దార్ కార్యాలయ భవన పనుల్లో గుత్తేదారు నిర్లక్ష్యం చూపుతున్నాడు. భవన నిర్మాణ సమయంలో తవ్వకాలు చేపట్టే క్రమంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రహరీ గోడ కూలిపోవడంతో పాటు మండలంలోని మూడో, నాలుగో వార్డులకు నీరు సరఫరా చేసే పైప్‌లైన్ కూడా దెబ్బతింది. నెలలు గడిచినా ఇప్పటి వరకు గుత్తేదారు మరమ్మత్తు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు రోజువారీ అవసరాలకు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి ప్రహరీ గోడ కూలిపోవడంతో రోగులు, సిబ్బంది కూడా అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. గుత్తేదారు నిర్లక్ష్యంపై టీఆర్ఎస్ మాజీ వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పైప్‌లైన్ మరమ్మత్తు చేసి ఆస్పత్రి ప్రహరీ గోడను పునర్నిర్మించాలని ఆయన అధికారులను కోరారు.స్థానికులు కూడా గుత్తేదారిపై చర్యలు తీసుకోవాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## 'హలో విద్యార్థి చలో కలెక్టరేట్'



**ప్రజాపక్షం/జమ్మికుంట:** పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు హలో విద్యార్థి చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని జమ్మికుంట మండల టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పలు విద్యాసంస్థల్లో విద్యార్థులను కలిసి విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా రూ.8వేల కోట్ల బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన టోకెన్లను సైతం ఇవ్వకుండా పేద మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువులను దూరం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రైవేట్ విద్యాసంస్థలను ఇబ్బందులను గురిచేస్తుందన్నారు. తిరిగి నవంబర్ 3న బంద్‌కు డిగ్రీ,పిజి కళాశాల యాజమాన్యాలు పిలుపునివ్వడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆబ్కారీశాఖ మంత్రి నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు మంత్రి నియమించకుండా తన వద్దే ఉంచుకుని విద్యను భ్రష్టు పట్టిస్తున్నాడని దుయ్యబట్టారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్వి నాయకులు హరీష్ వర్మ అప్పని, ఆవుల తిరుపతి యాదవ్, జవ్వాజి అనిల్, పొల్లాల శ్రీకాంత్, నాగరాజు, ఎండి రెహమాన్, విద్యార్థులున్నారు.

## మున్సిపల్ ట్రాక్టర్ సిబ్బంది నిర్లక్ష్యం

### మృతి చెందిన యువకుడు



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మున్సిపల్ ట్రాక్టర్లు నడి రోడ్డుపై ఎలాంటి ట్రాఫిక్ ప్రమాద హెచ్చరికలు లేకుండా నిలిపి ఉంచడంతో ముందున్న వాహనాన్ని తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు ట్రాక్టర్‌కు ఢీకొట్టి తీవ్రగాయాలతో మృతి చెందిన సంఘటన మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జమ్మికుంట ప్రధాన రహదారిలో రోడ్డు డివైడర్లలో ఉన్న పూల మొక్కలకు ఎర్ర మట్టి పోసేందుకు మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపి ఎలాంటి పార్కింగ్ లైట్లు వేయడం గానీ ప్రమాద హెచ్చరికలు గానీ పెట్టకుండా నిలిపి ఉంచడంతో వేగంగా వెనుక నుండి ట్రాలీ ఆటోను ఓవర్ చేసే క్రమంలో హుజురాబాద్ పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన వేముల అక్షయ్ సాయి(18) అనే యువకుడు తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలించే లోపే మృత్యువాత పడ్డాడు. మృతుడు కరీంనగర్‌లోని వాగేశ్వరీ కళాశాలలో బిఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. మండలంలోని రంగాపూర్ వద్ద ఉన్న తన స్నేహితుడిని ప్రతి రోజు బైక్‌పై తీసుకువచ్చి తన బైక్‌ను బస్టాండ్‌లో పెట్టి చదువుకునేందుకు ఆర్టీసీ బస్సులో ఇద్దరు కలిసి కరీంనగర్ కు వెళ్లేవారు. అందులో భాగంగా తన పల్సర్ బైక్‌పై హుజురాబాద్ నుండి రంగాపూర్ గ్రామానికి వస్తున్నాడు. ఆటో ట్రాలీని దాటేస్తున్న క్రమంలో రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపి ఉన్న మున్సిపల్ ట్రాక్టర్‌ను వెనుక నుండి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అక్షయ్ సాయి కి తలకు, ఛాతి కి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన అక్షయ్ సాయిని హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అక్షయ్ మృతి చెందినట్లు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసు విధులపై ప్రత్యక్ష అవగాహన

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజారక్షణ, భద్రతకు సంబంధించిన పోలీసు చట్టాలపై సమగ్రంగా వివరించారు. పోలీసు విధులు, షీటీమ్స్, భరోసా సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, స్పీడ్ లేజర్ గన్‌ల ఏర్పాటు, ట్రాఫిక్ నిబంధనల గురించి, సైబర్ క్రిమినల్స్‌ను పట్టుకునేందుకు పోలీసు విభాగం సాంకేతికతను అందిపుచ్చుకుని తీసుకుంటున్న చొరవ గురించి వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కరీంనగర్ రూరల్ సిఐ ఎ.నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ నరేష్ కుమార్, రూరల్ పోలీస్ స్టేషన్ మహిళ, పురుషుల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థి

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ పారమిత ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పి.సిమ్రితారెడ్డి జాతీయ స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఇటీవల హనుమకొండ పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ బాక్సింగ్ పోటీలలో పారమిత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పి.సిమ్రితారెడ్డి అండర్ 17 బాలికల 75 నుంచి 80 కెజిల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం గెలిచి ఈ నెల 28వ తేదీ నుంచి నవంబర్ 3 వరకు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఇటానగర్ పట్టణంలో నిర్వహించనున్న 69వ జాతీయ ఎస్‌జిఎఫ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని ఛాంపియన్‌షిప్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ డా.ఇనుగంటి ప్రసాద్‌రావు, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనూకర్‌రావు, వినోద్‌రావు, వియయం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, సమన్వయకర్త శ్రీనాథ్‌లు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థి పి.సిమ్రితారెడ్డిని బాక్సింగ్ కోచ్ ఎ.రామకృష్ణను అభినందించారు.

## ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు పోలీసు శాఖ పనితీరుపై అవగాహన కల్పించి పోలీసు ప్రజా బంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో సోమవారం ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించినట్లు జమ్మికుంట సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన డయల్ 100, మహిళల భద్రత కోసం పనిచేస్తున్న షీటీమ్స్ , నేరస్తులను గుర్తించే వేలిముద్రల గుర్తింపు వ్యవస్థ వంటి కీలక అంశాలపై వివరించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు, జరిమానాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్‌నేరాలు వాటిని ఎదుర్కొనే మార్గాలు, ఫిర్యాదుల నమోదు ప్రక్రియ, చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా నేరాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్ కోరారు. పోలీసు సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఇంగిలె రామారావు

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** గత కొద్దిరోజుల క్రితం ఇల్లందకుంట మండలంలోని మర్రివానిపల్లి గ్రామంలో జిల్లెల్ల మల్లారెడ్డి అనారోగ్యంతో చనిపోగా శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలె రామారావు పరామర్శించారు. మల్లారెడ్డి కుటుంబాన్ని, వారి కుమారుడు జలెందర్‌కు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, పరమేష్, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాషా తదితరులున్నారు.

# ‘నిజామాబాద్’లో నార్కోటిక్ బృందం దాడులు.. మత్తు పదార్థం స్వాధీనం

**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం నార్కోటిక్ బృందం దాడులు నిర్వహించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కృత్రిమ (కల్తీ) కల్లు తయారికి వినియోగించే మత్తు పదార్థాలు కలిగియున్న సమాచారం మేరకు నార్కోటిక్ ఇన్స్‌పెక్టర్ పూర్ణేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌తో పాటు మోపాల్ మండల పరిధిలో దాడులు నిర్వహించారు. వినాయకనగర్ ప్రాంతంలో నివాసం ఉండే ప్రవీణ్ గౌడ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మోపాల్‌లో గల తమ కల్లు డిపోకు వెళుతుండగా మార్గమధ్యంలో నార్కోటిక్ బృందం అతన్ని పట్టుకొని తనిఖీ చేశారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు వినాయక్ నగర్ ప్రాంతంలో ఉండే సాగర్ గౌడ్ అనే మరో వ్యక్తి ఇంట్లో సైతం నార్కోటిక్ టీం తనిఖీలు నిర్వహించారు. అనంతరం మోపాల్ మండల పరిధిలో గల కల్లు డిపో వద్ద రూ. 5 లక్షల విలువ చేసే సుమారు 500 గ్రాముల ఆల్ప్రాజోలం (మత్తు పదార్థాన్ని) సీజ్‌చేశారు. అనంతరం పట్టుబడిన ఇద్దరిని తదుపరి విచారణ చేసి, కేసు నమోదు చేసేందుకు మోపాల్ ఎస్ఐకి అప్పగించినట్టు సమాచారం. జిల్లా కేంద్రంలో నార్కోటిక్ బృందం వరుస దాడులు... నిజామాబాద్ మండల పరిధిలో గత 40 రోజుల వ్యవధిలో నార్కోటిక్ బృందం కల్తీ కల్లుకు వినియోగించే మత్తు పదార్థాలను పట్టుకునేందుకు రెండు సార్లు దాడులు నిర్వహించారు. గత నలభై రోజుల క్రితం సెప్టెంబర్ 16వ తేదీన నిజామాబాద్ మండల పరిధిలోని గుండారం ప్రాంతంలో ఓడిపోపై దాడిచేసి డిపో నిర్వాహకుడు రమేష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకొని అక్కడినుండి 600 గ్రాముల ఆల్ప్రాజోలంను పట్టుకొని ఇద్దరు నిందితులను రూరల్ పోలీసు స్టేషన్‌లో అప్పగించిన విషయం తెలిసింది. మళ్లీ సోమవారం నిజామాబాద్ మండల పరిధిలో నార్కోటిక్ టీం మరో దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని అల్ప్రా జోలం సీజ్ చేయడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## త్వరితగతిన పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తో కలిసి ఆయన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును పరిశీలించి,తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు సమర్పించారు.కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ సాయగౌడ్, బోధన్ ఏసీపీ ఎనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలనుపెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.

## ఖైదీలలో పరివర్తన, క్రమశిక్షణ లక్ష్యంగా కృషి

### తెలంగాణ కారాగార శాఖ ప్రధాన అధికారి (డిజి) డాక్టర్ సౌమ్య మిశ్రా

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఫ్యూయల్ అవుట్‌లెట్లు ఆదాయం కోసం కాదని అవి పరివర్తన క్రమశిక్షణ విశ్వాసానికి ప్రతీకలని తెలంగాణ కార్యదర్శి, ప్రధాన అధికారి డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. సోమవారంసెంట్రల్ జైల్స్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మల్లారం గ్రామంలో బిపిసిఎల్ ఫ్యూయల్ ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. సెంట్రల్ జైల్‌లో నివృత్తి కేంద్రం డి అడిక్షన్ సెంటర్‌ను, తేనెటీగల పెంపకం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తేనెటీగలు పెంపక కేంద్రం ఆపి కల్చర్ ద్వారా ఖైదీలలో ప్రశాంతతను నెలకొల్పవచ్చునని అన్నారు. డి అడిక్షన్ సెంటర్ నిసాక్ భారత్ అభియాన్ కింద సామాజిక సాధికార మంత్రిత్వ శాఖ సహకారంతో ప్రారంభించబడిందన్నారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలో మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువతను సన్మార్గంలో పెట్టడానికి ఈ కేంద్రాలు పనిచేస్తాయని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య, ఐజి ఆఫ్ ప్రిజల్ట్స్ ఎన్. మురళి బాబు, డిఐజిఎఫ్ రిజల్ట్స్ ఎం. సంపత్, బిపిసిఎల్ టెర్టరీ మేనేజర్ శ్రావణ్ కుమార్, నిజామాబాద్ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఆనందరావు, సైకాలజిస్టు శ్రావ్య, ప్రకృతి సంస్త ఎన్‌జివో కల్పన, సెంట్రల్ జైల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 19 మంది మహిళలు కైవసం

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** సోమవారం నిర్వహించిన నూతన మద్యం దుకాణాల లాటరీలో మొత్తం 19 మంది మహిళలకు అదృష్టం వరించిందని జిల్లా మద్యపానం మద్యపాన నిషేద అధికారి కె.మల్లారెడ్డి తెలిపారు. సోమవారం 27వ తేదీ నిజామాబాద్‌లోని భారతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 102 మద్యం దుకాణాల డ్రా ఫ్లాట్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఇట్టి డ్రా ఆఫ్ లాట్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కొత్త ఏ4 మద్యం దుకాణాలు పొందిన వారి వివరాల జాబితాను దుకాణం నెంబర్ల వారిగా పొందుపరచడం జరిగిందని తెలిపారు. కొత్తగా మద్యం దుకాణాలు పొందిన వారు కొత్తమద్యం దుకాణాలు డిసెంబరు 1 నుండి నవంబర్ 30, 2027 వరకు కాల పరిమితి కలిగి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, దరఖాస్తు దారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవీపేటలో భారీ చోరీ..పోలీసుస్టేషన్ సమీపంలోనే బీభత్సం

**ప్రజాపక్షం/ఎడపల్లి/నవీపేట్:** నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలో దొంగలు భీభత్సం సృష్టించారు. బాసర ప్రధాన రహదారి పక్కన గల వైష్ణవి సిల్వర్ మర్చంట్ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు 10.50లక్షల విలువైన ఆభరణాలను గుర్తు తెలియని దుండగులు చోరి చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సీఐ శ్రీనివాస్, బాధితుల కథనం ప్రకారం, నవీపేట్ మండల కేంద్రానికి చెందిన నాంపల్లి పవన్‌కు చెందిన ఈ దుకాణం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. ఆదివారం అర్ధ రాత్రి తరువాత మాస్కులు, నల్లని దుస్తులు ధరించిన ముగ్గురు దొంగలు దుకాణానికి వేసిన తాళాలను పగులగొట్టారు. అనంతరం షట్టర్‌ను ఎలక్ట్రిక్ కట్టర్‌తో కత్తిరించి లోపలికి ప్రవేశించారు. దుండగులు సుమారు ఆరు కిలోల వెండి, పది గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. అయితే షట్టర్ కట్ చేసే శబ్ధానికి పక్కనే ఉన్న బీహారీ కూలీలు మేల్కొని అరవగా, దొంగలు వారిని భయపెట్టి లోపలికి వెళ్లారు. స్థానికుల సమాచారంతో దుకాణం యజమాని పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న సెంట్రల్ క్రైమ్ సెల్ ఏసీపీ నాగేంద్ర చారి, సిఐ సాయినాథ్, నిజామాబాద్ నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్, నవీపేట్ ఎస్సై తిరుపతి, క్లూస్ టీం సహాయంతో



ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు. దుండగులు మహారాష్ట్రకు చెందిన వారిగా భావిస్తున్నామని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటన మండల కేంద్రంలో భద్రత పై ప్రశ్నలు లేవనెత్తుతోంది. దొంగలను త్వరగా పట్టుకోవడానికి పోలీసులు అన్నీ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## పంట కాల్వ మార్పులతో నష్టం

### జిల్లా కలెక్టర్‌కు రైతు వినతి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** పంట కాలువలను మార్చడం వలన గత రెండు సంవత్సరాలుగా పంట నష్టపోతున్నానని, తనకు న్యాయం చేయాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ రైతు సోమవారం జిల్లా కలెక్టర్‌తో పాటు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎడపల్లి పెద్ద చెరువు ఆయకట్టు కింద తనకు చెందిన నాలుగు ఎకరాల పొలం ఉందని రైతు కంజరి హన్మండ్లు తెలిపారు. గత రెండేళ్లుగా శివారు ప్రాంతంలోని కొందరు రైతులు పంట ప్రధాన కాలువను మార్చడం వలన తన పొలంలోకి నీరు చేరి, పంట పూర్తిగా మునిగిపోయి తీవ్రంగా నష్టపోతున్నానని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. పంట ముఖ్య కాలువను మార్చడం వల్లే ఈ నష్టం జరుగుతోందని, వరి పంట పూర్తిగా నీటిలో మునిగిపోవడం వల్ల తాను తీవ్రంగా నష్టపోయానని రైతు హన్మండ్లు మీడియాకు తెలిపారు. ఈ సమస్యపై గతంలోనే సంబంధిత ఇరిగేషన్ అధికారులకు కూడా వినతి పత్రం సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. రైతు కంజరి హన్మండ్లు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో పాటు తహసీల్దార్ దత్తాత్రికి పంట నష్టం చేస్తున్న ఈ మార్పులను సరి చేయాలని వినతి పత్రం అందచేశారు. అధికారులు తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధికి ఆమడదూరంలో ముధోల్

### నియోజకవర్గ కేంద్రంగా ఉన్నా.. అన్ని రంగాల్లో వెనుకంజ!

**ప్రజాపక్షం/ముధోల్ :** పేరుకే నియోజకవర్గ కేంద్రం ఎలాంటి మౌలిక వసతులు లేని నియోజకవర్గ కేంద్రాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ముధోల్ పేరుంటుంది. నిజాం కాలం నుండి తాలుకా కేంద్రంగా ఉన్న అభివృద్ధికి మాత్రం నోచుకోలేని పరిస్థితి ముధోల్ కు ఉంది.అన్ని రంగాల్లో ముధోల్ నియోజకవర్గ కేంద్రం వెనుకబడి ఉందనేది స్పష్టం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ ఆవిర్భావ అనంతరం సైతం ఎందరో ప్రజాప్రతినిధులు మారిన ముధోల్ పరిస్థితి మాత్రం గడ్డెక్కలేదు.ముధోల్ వెనుకబడడానికి కారణం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం సైతం తోడైందనడానికి ఎలాంటి సందేహం లేదు.ఇంతకు ముందున్న పాత భవనాల్లోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి.ముఖ్యంగా ప్రజలకు సేవలందించే అతి ముఖ్యమైన రెవెన్యూ కార్యలయం,ప్రభుత్వ ఆసుపత్రి భవనాలు పెచ్చులతో కూడా కూలిపోయే స్థితికి చేరాయి.ఇంతే కాకుండా ఇటీవల ప్రకటించిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఏర్పాటుకు సైతం ముధోల్ కు ప్రాధాన్యతనివ్వలేదు.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఏర్పాటుకు స్థల సేకరణ జరిగిన ఏర్పాటుకు నోచుకోకపోవడానికి ప్రభుత్వం,ప్రజాపత్రినిధులు ముధోల్ నియోజకవర్గం పై ఎంత శ్రద్ధ చూపిస్తున్నారో ప్రజలకు తేటతెల్లమవుతోంది.ప్రతి సారి అభివృద్ధి విషయంలో ముధోల్ కు మొండిచేయి చూపడం పరిపాటిగా మారింది.

## సారు మాపై దయతలచండి

### వైద్యం కోసం వేడుకుంటున్న ముధోల్ ప్రజలు..

సారు.. మాపై దయతలచాలంటూ కనీస వైద్య సదుపాయాలు కల్పించాలని ఉన్నతాధికారులకు,ప్రజాప్రతినిధులకు వేడుకుంటున్నారు. స్థానిక ప్రజలు.పాత భవనంలోనే ఎలాంటి సదుపాయాలు లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే సేవలు కొనసాగుతున్నాయి.గత ప్రభుత్వ హయాంలో మార్చి నెల 2022 సంవత్సరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సామాజిక ఆసుపత్రిగా మారుస్తూ 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి నాటి మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేశారు.30 పడకల ఆసుపత్రి భవనం నిర్మాణం ప్రారంభించిన అది బేస్ మెట్ లెవెల్ కే పరిమితమైంది.దీంతో ముధోల్ తో పాటు చుట్టూ పక్కల ప్రజలకు వైద్యం అందక ఇతర ప్రాంతాలకు వెళ్ళి వ్యయప్రయాసాలతో ఇబ్బందులకు గురవుతున్నారు.ఎన్నో ఏళ్ల నుండి ఇక్కడ కనీస వైద్య సదుపాయాలు అందడంలేవు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సామాజిక ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయడంతో ఒక సూపరిండెంట్ ముగ్గురు వైద్యులను నియమించిన ఓపీ సేవలు అందడం వరకే పరిమితమయ్యాయి. అత్యవసర సేవలందక కొందరి ప్రాణాలు పోతున్నాయి. రాత్రి సమయాల్లో వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో స్థానిక ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు,ఉన్నతాధికారులు ముధోల్ ప్రజలకు నిత్యం వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

## నిరంతరం వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలి..

### వరగంటి జీవన్ స్థానిక నాయకులు..

నియోజకవర్గ కేంద్ర ప్రజలకే కాకుండా చుట్టూ పక్కల ఉన్న గ్రామాల ప్రజలకు నిరంతరం వైద్య సేవలందించేలా ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.ఇప్పటికైనా ముధోల్ నియోజకవర్గానికి కేటాయించబడ్డ 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాం పూర్తి చేసి ఇక్కడి ప్రజలకు నిత్యం వైద్యం అందేలా అధికారులను మార్గనిర్దేశం చేయాలని కోరారు.అంతే కాకుండా మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించడానికి మార్చురీని ఏర్పాటు చేయాలని విన్నవించారు.

# ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలి: డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాలోని బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం జిఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో డైరెక్టర్ సమావేశం నిర్వహించి, గోలేటి ఉపరితల గని పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డితో కలిసి ఆయన ఏరియా లోని వివిధ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టినందున నిత్యం 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఖైరీగురా ఓపెన్ కాస్ట్ గనిలోని పని స్థలాలను తనిఖీ చేసి ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న మహిళా ఉద్యోగులతో మాట్లాడి, మగ ఉద్యోగులతో సమానంగా వారు చేస్తున్న పనులను చూసి అభినందించారు. బ్లాస్టింగ్ పనుల గురించి ఉద్యోగులు డైరెక్టర్‌కు వివరించారు. ఇలాగే పనిచేస్తే త్వరగా పదోన్నతులు కల్పిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖైరీగురా పివో మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఎస్ఓటు జిఎం. రాజమల్లు, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## వర్క్‌షాప్‌లో కొత్త మోటార్ సైకిల్ స్టాండ్‌కు శంకుస్థాపన



ప్రజాపక్షం/మందమర్రి:మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికుల సౌకర్యార్థం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి ప్రతిపాదన మేరకు సోమవారం కొత్త మోటార్ సైకిల్ స్టాండ్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ డివిజన్ మేనేజర్ దూప్ సింగ్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాథిని సుదర్శనం, ఇంజినీర్లు సత్యగౌడ్, సదానందం, నాగుల శ్రీనివాస్, యూనియన్ నాయకులు సిహెచ్‌పి. శర్మ, ములకలపల్లి వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా తిరుపతి

ప్రజాపక్షం/మంచిర్యాల:భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్రథమ మహాసభలు సోమవారం నిజామాబాద్‌లో 25, 26, 27 తేదీల్లో జరిగాయి. ఈ మహాసభల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన మిట్టపల్లి తిరుపతిని రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించారు. విద్యార్థి ఉద్యమాలలో తిరుపతి చేసిన కృషిని గుర్తించి ఈ అవకాశాన్ని కల్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో విద్యార్థుల ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తూ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## గోలేటి ఓపెన్‌కాస్ట్ ప్రారంభమైతే పూర్వవైభవం

ప్రజాపక్షం/రెబ్బెన : గోలేటి ఉపరితల గని ప్రారంభం అయితే బెల్లంపల్లి ఏరియాకు పూర్వ వైభవం వస్తుందని డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గోలేటిలోని సింగరేణి అతిథి గృహంలో ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు గోలేటి ఓపెన్ కాస్ట్ ఆవశ్యకతను ఎంఎల్ఏ కోవ లక్ష్మికి వివరించారు. ప్రస్తుతం ఒక్క ఖైరీగురా ఉపరితల గని నుండి మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని, గోలేటి ఓపెన్ కాస్ట్ త్వరగా ప్రారంభమయ్యేందుకు తమ వంతు సహకారం అందించాలని ఆయన ఎంఎల్ఏను కోరారు. అనంతరం జిఎం ఎం. విజయ భాస్కర్ రెడ్డితో కలిసి ఎంఎల్ఏ కోవ లక్ష్మి ని సన్మానించి మొక్కను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం. కె. రాజమల్లు పాల్గొన్నారు.

## పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం / నస్పూర్ : మహాత్మ జ్యోతిరావు గోవిందరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మంచిర్యాల ప్రాంత సామాజిక ఉద్యమకారులు డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూణేలో 1848వ సంవత్సరంలో మహిళల విద్య కోసం మొదటి పాఠశాలను ఏర్పాటు చేసిన మహనీయులని కొనియాడారు. నాటి నుండి వారి జీవితాంతం సమాజ శ్రేయస్సు కోసం పోరాటాలు చేశారని కీర్తించారు. ఈ రోజుల్లో జ్యోతి రావు, సావిత్రిబాయి పూలేల ప్రతిమ చైతన్యం, స్ఫూర్తి, జ్ఞానంగా భావిస్తున్నామని అన్నారు. పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, సాయి, సంధ్యారాణి, నరేష్, వేముల కిరణ్, పాషా, కుమారస్వామి, రాకేష్, సంపత్, సాయి పాల్గొన్నారు.



## సమష్టి కృషితో అవినీతి రహిత సింగరేణిని సాధించాలి

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : ఉద్యోగుల సమిష్టి కృషితో అవినీతి లేని సింగరేణిని సాధించవచ్చని ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ (జిఎం) కర్రు రాజేందర్ అన్నారు. సోమవారం ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27 నుంచి నవంబర్ 02వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా మనందరం ప్రతిజ్ఞ చేయాలని కోరారు. అవినీతి రహిత భారతదేశం అభివృద్ధి చెందిన దేశం అనే నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం వారోత్సవాల నినాదం విజిలెన్స్ మన అందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి నిజాయితీగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తే సంస్థ ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం ఎస్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కెబాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఎజిఎం ఫైనాన్స్ బీభత్సా, డిజిఎంలు ఎస్. అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్ కుమార్, హరి నారాయణ, ఎస్ఇ పర్చేజ్ చంద్రశేఖర్, రాజేశ్వర రావు, మహేష్, రాజేష్, శ్రీనివాస్, ప్రబంధిత, సందీప్ పాల్గొన్నారు.



## అవినీతి నిర్మూలనలో ప్రతి ఉద్యోగి బాధ్యత వహించాలి

జిఎం ఎన్. రాధాకృష్ణ




ప్రజాపక్షం/మందమర్రి : అవినీతి నిర్మూలనలో ప్రతి ఉద్యోగి చైతన్యవంతుడై బాధ్యతగా వ్యవహరించాలని మందమర్రి ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ అన్నారు. సోమవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను జిఎం ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలతో పాటు సింగరేణి కంపెనీలోనూ అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1987లో సింగరేణి కంపెనీలో నిఘా విభాగం ఏర్పాటైందని, ప్రస్తుతం చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. వెంకన్న నాయకత్వంలో సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు. సంస్థలో ఏవైనా అక్రమాలు గమనించినచో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. అవినీతి దేశ అభివృద్ధికి అడ్డంకి అని, దాన్ని నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా సింగరేణి ఉద్యోగులు, అధికారులు, సింగరేణి పాఠశాల విద్యార్థుల కోసం కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారితో "సమగ్రత ప్రతిజ్ఞ" చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం. విజయ్ ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సిఎండిఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, సీనియర్ పిఓ. సత్యనారాయణ, జిఎం. ఆఫీస్ హెచ్ఓడిలు, అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## భార్యపై కత్తెర దాడి.. భర్త రిమాండ్‌కు

ప్రజాపక్షం/జన్నారం: కట్నం కోసం భార్యపై కత్తెరతో దాడి చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. మంచిర్యాల జిల్లా, భీమారం మండలానికి చెందిన పోతుల రజిత ఇచ్చిన ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రజిత చెల్లెలు కోట వనితకు జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలం, స్తంభంపల్లి గ్రామానికి చెందిన సుర అశోక్ (30)తో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఐదు లక్షల రూపాయలు కట్నంగా ఇచ్చారు. మొదట్లో బాగానే ఉన్న అశోక్, కొంతకాలం తర్వాత అదనపు కట్నం కోసం భార్యను వేధించడం మొదలుపెట్టాడు. వనిత గర్భిణీగా ఉన్నప్పటి నుంచి అనుమానంతో వేధింపులు పెరిగాయని, పంచాయతీ చేసినా మార్పు రాలేదని రజిత ఫిర్యాదులో పేర్కొంది. రెండు సంవత్సరాల క్రితం వనితను పుట్టింటికి పంపించి అశోక్ దుబాయ్ వెళ్ళిపోయాడు. ఇటీవల తిరిగి వచ్చిన అశోక్, అక్టోబర్ 24న ఉదయం 10 గంటలకు వనిత ఇంటికి వెళ్ళి, అదనంగా రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గొడవపడ్డాడు. అనంతరం అక్టోబర్ 25న మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, కత్తెరతో భార్యపై పదిసార్లు దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన వనితను స్థానికులు 108 వాహనంలో లక్షెట్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నంబర్ 206/2025 కింద నమోదు చేసి, నిందితుడు అశోక్‌ను అరెస్టు జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు.

## స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పోటీకి సిద్ధం కావాలి

ప్రజాపక్షం/జన్నారం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి బిజెపి కార్యకర్త పోటీకి సిద్ధం కావాలని, జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలన్నీ కాషాయ జెండా కిందకు రావాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా మండల కేంద్రంలో బిజెపి శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్నారం అంటే తనకు అమితమైన ప్రేమ ఉందని, ఎల్లవేళలా తన సైన్యానికి అందుబాటులో ఉంటూ, రథసారథిగా విజయం వైపు నడిపిస్తానని తెలిపారు. జన్నారం నుంచి బిజెపి విజయం ఖాయమని, ప్రజలు ఇప్పటికే మార్పు వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు. సమావేశంలో పాల్గొన్న సిర్పూర్ ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ మాట్లాడుతూ నవంబర్ మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నందున, కార్యకర్తలందరూ సిద్ధం కావాలని, ప్రతి ఒక్కరూ బరిలోకి దిగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు ముకేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన రఘునాథ్ ఎర్రబెల్లిని బిజెపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు మధుసూదన్ రావు, జిల్లా నాయకులు కొంతం శంకరయ్య, బిజెవైఎం అధ్యక్షుడు రమేష్, ఎస్‌టి మోర్చా జిల్లా అధ్యక్షుడు నాయక్, కందుల రమేష్, దేవేందర్ ఇతర మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రగా శబరిమలకు అయ్యప్ప భక్తుడు

ప్రజాపక్షం/శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కాలనీకి చెందిన అయ్యప్ప భక్తుడు బోడ రామకృష్ణ అయ్యప్ప మాల ధరించి మహా పాదయాత్ర ద్వారా శ్రీ భక్తాంజనేయ ఆలయం నుండి సోమవారం శబరిమలకు బయలుదేరారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ (ఏబిఏపి) శ్రీరాంపూర్ అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర మీడియా ఇంచార్జి బొస్సరి రాజేశం, టిబిజికెఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డిలు యాత్రను ప్రారంభించారు. ముందుగా ఆలయంలో వేద పండితులు కొమ్మెర విజయశర్మ పూజలు నిర్వహించారు. శ్రీరాంపూర్ కాలనీ అయ్యప్ప సేవా సన్నిధానం గురుస్వాములు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తుడు రామకృష్ణ 1400 కిలోమీటర్ల దూరంలో ఉన్న శబరిమలకు పాదయాత్ర చేయనున్నారని, 45వ రోజు పంపా నదికి చేరి అయ్యప్పను దర్శించుకుంటారని చెప్పారు. పాదయాత్ర చేస్తున్న భక్తులకు భగవంతుడు ఆరోగ్యం,అయ్యప్ప స్వామి సన్నిధానంకు చేరుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నవీన్, రాజేష్, గంగాధర్, భరత్‌రెడ్డి, కొండి రజినీకాంత్, వినోద్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రక్తదాతల సందడి.. 350మందికి పైగా రక్తదానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని,నిర్మల్ జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించబడింది.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూకి గౌరవ ప్రదంగా నివాళులు అర్పించిన అనంతరం జరిగిన ఈ శిబిరంలో,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి,సిబ్బందికి,ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.ఎస్పీతో పాటు బైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార ఐపీఎస్.నిర్మల్ ఏఎస్పీ రాజేష్‌మీన,కూడా రక్తదానం చేశారు.



### ప్రజల అపూర్వ స్పందన..

ఈ శిబిరానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు తండోపతండాలుగా తరలిరావడం విశేషం,తానూర్,బైంసా,లోకేశ్వరం,కడెం వంటి సుదూర ప్రాంతాల నుండి కూడా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసుకొని మరీ వచ్చి రక్తదానం చేశారు.వ్యాపారవేత్తలు,రైతులు,యువత,ఆటో యూనియన్ల సభ్యులు,30 మందికి పైగా డియంహెచ్ఓ(జిల్లా మెడికల్ హెల్త్ ఆర్గనైజేషన్)సిబ్బంది వంటి విభిన్న వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.ఇప్పటివరకు 350 మందికి పైగా ప్రజలు రక్తదానం చేసినట్లు అధికారులు తెలిపారు.అనంతరం జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం అంటే వారికి కొత్త జీవితం ఇవ్వడమే రక్తదాతలు సమాజంలో నిజమైన దేవుళ్లు అని కొనియాడారు.ప్రతీ ఒక్క రక్తపు బొట్టు ఒక్క ప్రాణాన్ని కాపాడుతుంది.అని పేర్కొంటూ,ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ మోగా రక్తదాన శిబిరంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఉపేందర్ రెడ్డి,ఇతర పోలీస్ అధికారులు,ఇన్స్పెక్టర్లు,ఎస్ఐలు,డాక్టర్లు,మెడికల్ సిబ్బంది,టెక్నీషియన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తాండూర్‌లో అరుదైన తెల్లని కాకి

**ప్రజాపక్షం/తాండూర్ :** మంచిర్యాల్ జిల్లా తాండూర్ వద్ద పూర్తిగా తెల్లని దేశీయ కాకి కనిపించింది. దీనిని హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ (హైటికోస్) సభ్యుడు, వన్యప్రాణి పరిరక్షకుడు శ్రీపతి వైష్ణవ్ గుర్తించి, ఈ అరుదైన అంశాన్ని వెల్లడించారు. ఇప్పటివరకు తెలంగాణలో కొన్ని భాగాలు తెల్లగా ఉన్న కాకులు మాత్రమే కనిపించగా, పూర్తిగా తెల్లగా ఉన్న కాకి మన ప్రాంతంలో నమోదు కావడం ఇదే మొదటిసారి. ఈ కాకికి ల్యూసిజం అనే అరుదైన జన్యు పరిస్థితి ఉందని, దీని వల్ల పక్షి రెక్కలు పూర్తిగా తెల్లగా మారినా కళ్ల రంగు మాత్రం సహజంగా ఉంటుందని వైష్ణవ్ వివరించారు. ల్యూసిజంలో కళ్లు సాధారణంగా ఉంటాయి, కానీ అల్బినిజంలో కళ్లతో సహా శరీరమంతా తెల్లబడుతుంది అని ఆయన రెండింటి మధ్య ముఖ్యమైన తేడాను తెలిపారు. తెల్లని రంగు కారణంగా ఈ పక్షులు గద్దలు, పిల్లి జాతుల వంటి మాంసాహారులకు సులభంగా కనిపిస్తాయని, ఆహారం వెతుకుతున్నప్పుడు ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. మారిన రూపం వల్ల ఇతర కాకులతో సామాజిక సంబంధాలు, సంతాన ఎంపిక కూడా ప్రభావితం కావచ్చు. అయినప్పటికీ, కాకులు చాలా తెలివైనవని, వాటి సామాజిక బంధాలు, సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యం వల్ల ఈ ఇబ్బందులను అధిగమించగలవని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు.

## వ్యాక్సినేషన్ వేయించాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** ఉచిత సామూహిక గాలికూంటువ్యాధి నిరోధక టికాల కార్యక్రమంలో భాగంగా నేరడిగొండ మండలం లింగట్ల గ్రామంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రామారావు రాథోడ్,తనిఖీ చేయడం జరిగింది.మండల పశువైద్యాధికారి జీవన్ రాథోడ్, సిబ్బంది వెంకన్న, తరుణ్,సురేష్,శివప్రసాద్, జంగు,మాజీ పిఎసిఎస్ చైర్మన్ నానక్ సింగ్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం ప్రధానోపాధ్యయునికి పురస్కారం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** స్థానిక నిర్మల్ పట్టణంలో నిర్వహించిన "విశిష్ట సేవా పురస్కారాల్లో " భాగంగా భాష్యం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.ప్రశాంత్ విశిష్ట విద్యా రత్న 2025 అవార్డును అందుకున్నారు.ఈ ప్రతిష్టాత్మక అవార్డును పాటే మా ప్రణామ్,లయన్స్ క్లబ్ వారియర్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలోప్రదానంచేశారు.భాష్యం హైస్కూల్ అధ్యక్షుడు పూండ్లు సుధాకర్ రెడ్డి,డైరెక్టర్ ప్రియ కపిల్,కరస్పాండెంట్ కౌశిక్ ప్రశాంత్ కి హృదయపూర్వకఅభినందనలు తెలిపారు.

## ఎంపిడిఒగా లవకుమార్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/ముధోల్ :** మండల కేంద్రమైన ముధోల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవోగా లవకుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు.ఇంచార్జ్ ఎంపీడీవోగా శివకుమార్ విధులు నిర్వర్తించిన స్థానంలో ఎంపీడీవోగా లవ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు.ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించడంతో కాంగ్రెస్ నాయకులు శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి,సీనియర్ నాయకులు ప్రేమనాథ్ రెడ్డి, కిషన్ పటేల్, రావులశ్రీనివాస్,ఎం.ఎ అజీజ్,దిగంబర్, ఎస్.కె. నజీమ్, కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ షేక్ అన్సర్‌పాషాకు అరుదైన గౌరవం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా న్యూవెల్మల్ గ్రామానికి చెందిన యువ సామాజిక కార్యకర్త షేక్ అన్సర్ పాషా కి 'విశిష్ట సామాజిక సేవా రత్న పురస్కారం' లభించింది.సమాజ సేవలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.అన్సర్ పాషా "ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ" అనే సంస్థను స్థాపించి,నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ సొసైటి ద్వారా పేద విద్యార్థులకు పుస్తకాలు,అవసరమైన దుస్తులు, ఆహారం, వైద్య సహా యం అందిస్తూ ఎంతో మందికి అండగా నిలుస్తున్నారు. సమాజ సేవ పట్ల ఆయనకున్న అంకితభావం,నిస్వార్థ సేవలను పలువురు అభినందిస్తున్నారు.అన్సర్ పాషా సేవలను గుర్తించిన "పాటే మా ప్రాణం"లయన్స్ క్లబ్ నిర్మల్ వారియర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశాయి .నిర్మల్ జడ్జి నర్సయ్య,లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డి,కంటి వైద్యులు.డా.కృష్ణం రాజు ,నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని అన్సర్ పాషాకు పురస్కారాన్ని ప్రదానం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన అన్సర్ పాషా "నా సేవలకు గుర్తించి ఇచ్చిన ఈ గౌరవానికి ఎంతో ఆనందంగా ఉంది.ఇది నాకు మరింత ప్రేరణనిచ్చింది.ఇక ముందు కూడా సమాజ సేవలో ముందుండి మరిన్ని కార్యక్రమాలు చేపడతాను "అని ధన్యవాదాలు తెలియజేశారు.ఆయన సేవలు మరికొంత మందికి ఆదర్శంగా నిలవాలని అతిథులు ఆకాంక్షించారు.

## జ్ఞానసరస్వతి వర్శిటీని ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** పీజీ కాలేజీ భూములను కాపా డి యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉన్న పీజీ కాలేజీని బేస్ చేసుకుని నూతన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు భగత్ సింగ్ భవనంలో సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ..జిల్లా కేంద్రంలో ఉన్న పీజీ కాలేజీ భూములు కబ్జాలకు గురికాకుండా కాపాడవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు.దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేస్తానన్న విశ్వవిద్యాలయాన్ని ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.నిర్మల్ జిల్లాలో ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడం వల్ల పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక,మధ్యలోనే విద్యను ఆపేసే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కావున జ్ఞాన సరస్వతి పేరిట నిర్మల్ జిల్లా కేంద్రంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.యూనివర్సిటీ ఏర్పాటుయితే స్థానికంగానే యువతకు ఉన్నత విద్య అందుబాటులో ఉంటుందని,ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీ ఏర్పాటుకు వెంటనే కృషి చేయాలని డిమాండ్ చేసిన విద్యార్థి సంఘాల నాయకులు,లేనియెడల దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగాంబర్,సింగారి వెంకటేష్,పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు,ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం శివాజీ గౌడ్, జస్వంత్, రాకేష్, కార్తీక్, రాజు, రంజిత్ కుమార్, రవి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** నిరుపేదల వైద్యం కోసం ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించే సాయాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణంలోని సర్సిల్క్‌లో ఉన్న ఎంఎల్ఏ నివాసంలో పెంచికల్‌పేట్ మండలం మెట్లగూడ గ్రామానికి చెందిన చౌదరి రోజాకు మంజూరైన రూ.1.40 లక్షల ఎల్ఓసి లెటర్‌ను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జునగరి మధుకర్, బండి ప్రభాకర్, రాగుండి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి



**ప్రజాపక్షం / కేరమేరి :** హెల్మెట్ ధరించడంవల్ల అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని ఎస్ఐ మధుకర్ అన్నారు. సోమవారం కేరమేరి మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బైక్ ర్యాలీని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ. మధుకర్ స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీని ప్రారంభించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమై తహసీల్దార్ కార్యాలయం, సుల్తాన్ గూడా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపిడిఒ అంజాద్ పాషా, సిఐటియు మండల కన్వీనర్ కూటికేల ఆనంద్ రావు, మండలం యూత్ నాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**ప్రజాపక్షం/తాళ్ళగురిజాల/ బెల్లంపల్లి :** తాళ్ళగురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ అఫ్ పోలీస్ ఏ. భాస్కర్ అధికారులకు ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన సోమవారం తాళ్ళగురిజాల పోలీస్ స్టేషన్ ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు వాటి గురించి తీసుకుంటున్న చర్యలను డిసిపి అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని రిసెప్షన్ ఆఫీసర్, సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని, రౌడీ షీటర్స్, హిస్టరీ షీటర్స్, అనుమానితుల పైన నిరంతర నిఘా పెట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, గంజాయి మత్తు పదార్థాలు, పోక్సో చట్టం, షీ టీమ్స్, భరోసా సెంటర్, డయల్ 100 పైన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లోని ఫైళ్ళు, రికార్డులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డిసిపి ఎస్ఐ బి. రామకృష్ణ, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎసిపి ఏ. రవికుమార్, బెల్లంపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ సిహెచ్. హనోక్ తదితరులు పాల్గొన్నారు.

# తుపాను ప్రభావంతో రైతులు నష్టపోకుండా చూడాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్:** తుఫాను ప్రభావంతో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో రైతులకు నష్టం వాటిల్లకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సోమవారం సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన వరి ధాన్యం నిల్వలతో పాటు యా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట ధాన్యం వర్షానికి తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. తుపాను ప్రభావం రోజుల పాటు అవసరమైతే వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కాగా కొనుగోలు



కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ జరుపాలని, వెంట వెంటనే ట్రక్‌షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని ఆదేశించారు. కాగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. ఎస్ఐఆర్ అమలు కోసం చేపడుతున్న కసరత్తుపై మండలాల వారిగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2002 ఓటరు జాబితాతో 2025 ఓటరు జాబితాను జాగ్రత్తగా సరి చూసుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించాలని తహసీల్దార్లకు సూచించారు. తప్పిదాలకు తావు లేకుండా మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. బీఎల్ఓ సూపర్‌వైజర్లు ఒక్కో పోలింగ్‌స్టేషన్ వారిగా బీఎల్ఓతో స్వీయ పర్యవేక్షణలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా జరిపించాలన్నారు. నిర్దిష్ట గడువులోపు దీనిని పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, సబ్‌కలెక్టర్లు వికాస్‌మహతో, అభిగ్యాన్‌మాల్వియ, కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్,బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో 10వ వార్షికోత్సవంలో

**ప్రజాపక్షం/భైంసా:** భైంసా పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ క్షేత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులుగా జరిగినటువంటి పూర్ణాహుతి,చండీయగం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ముథోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త వారికి ఆలయ కమిటీ వారు పూర్ణకుంభములతో సాధారంగా ఆహ్వానం పలికి అయ్యప్ప స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

## మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెల బిల్లులు చెల్లించాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్:** మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెల బిల్లులు, వేతనాలు చెల్లించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఆదివారం ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను కోడిగుడ్లను వంటగ్యాస్‌ను సరఫరా చేసి రాష్ట్ర ప్రభుత్వ హామీలో భాగంగా పదివేల వేతనాన్ని అమలు చేయాలని కార్మికులకు తమిళనాడు రాష్ట్రంతో ఇన్సూరెన్స్ యూనిఫారం గుర్తింపు కార్డులు, ప్రమాద నష్టపరిహారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గణేష్, రాజేశ్వర్, అనిల్,సుజిత్, ఇమ్రాన్ అలీ, ఫిరోజ్ అలీ, గంగామణి, నాగలక్ష్మీ, సుభోద్, వంశీ కార్మికులు పాల్గొన్నారు.

## పెన్షన్ కోసం బారులు తీరిన పెన్షనర్లు

**ప్రజాపక్షం/నందిపేట్:** నెలాఖరు వచ్చిందంటే చాలు పెన్షన్ కోసం ఎదురుచూపులు. పోస్టాఫీసు వద్ద బారులు తీరుతారు. నందిపేట్ మండల కేంద్రంలో ఈ పరిస్థితి దయనీయం. పెన్షన్ కోసం గంటల కొద్ది ఉండాల్సివస్తుంది. హనుమాన్ గల్ల దుర్గాదేవి మండపం వద్ద రెండు రోజులుగా అందుకే వందల మంది బారులు తీరుతున్నారు. పెన్షనర్ల సౌకర్యార్థం పోస్టాఫీసు వద్ద ఒకరు, రాజ్ నగర్ దుర్గాదేవి వద్ద ఒకరు ఉంచి పంచితే కొంతవరకు సమస్య తీరుతుంది. వృద్ధులకు అంగవైకల్యం ఉన్న వారికి ఇబ్బంది కలుగుతుంది. కనుక ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ఎవరికి ఇబ్బంది కాకుండా పోస్టల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పెన్షనర్లు కోరుతున్నారు.

## సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో సోయా చిక్కుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు రైతులు సోమవారం ప్రజావాణిలో విన్నవించారు. గత నెలలో పంట చేతికం దినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులం చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. రబీ సీజన్‌కు ఆర్థికంగా కావాల్సిన పెట్టుబడి నిమిత్తం రైతులు చాలా తక్కువ ధరకు దళారులను ఆశ్రయించి నష్టపోతారన్నారు. బయట మార్కెట్‌లో సోయా పంటను 3500 నుంచి 4000వ రకు దళారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎంఎస్‌పి ధర సుమారు రూ. 5400 ఉన్నందున ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు



క్వింటాల్‌కు రూ. 1400 అదనంగా ఆదాయం ఏర్పడుతుందని రైతులు తమ వినతి పత్రంలో తెలిపారు. వెంటనే సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరను అందించాలని బోధన్ నియోజకవర్గ సోయా రైతులు కోరారు. వినత పత్రం అందించిన వారిలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## హోసకొత్తూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని చౌట్‌పల్లి పశు వైద్యాధికారి డాక్టర్ వసంత్‌కుమార్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి పశువుకు తప్పకుండా టీకా వేయించుకోవాలని అలాగే ప్రతి ఆరు నెలలకోకసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. గాలికుంటూ వ్యాధి బారిన పడటంతో నోటిలో చాలా పొంగకారడం, కాళ్ల డిక్కలలో పగుళ్లు ఏర్పడి నడవలేకపోవటం, పాల ఉత్పత్తి తగ్గిపోవటం పశువుల అబార్షన్ల అవటం వంటి లక్షణాలు ఏర్పడతాయి. కావున రైతులు ముందుజాగ్రత్త కోసం తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సత్యం, ఆదర్శ సంఘం అధ్యక్షులు మహిపాల్, క్రాంతి, శ్రీనివాస్, నరేందర్, అరుణ్, లింబాద్రి పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా పశువులకు అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మోర్తాడ్ పశువైద్యాధికారి డా.గౌతమ్ రాజ్ తెలిపారు. పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 68పశువులకు ఉచిత గాలి కుంటు టీకాలు వేయడం జరిగింది. మండలంలోని పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ గౌతమ్ రాజ్ సూచించారు. ఈ కార్య



క్రమంలో గ్రామస్తులు కుమ్మరి సాయన్న, పిడుగు రాజేందర్, బాశాల రాజేశ్వర్, రమేష్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది డా.గౌతమ్ రాజ్, ఎల్ఎస్ఏ తైసీమ్, ప్రభాకర్, ప్రభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :**మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కొబ్బరికాయ కొట్టి ఐకెపి ఎపియం ప్రమీల ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిసి కుంట శ్రీనివాస్, పురుస్తు నరేష్, మహిళా సంఘాల సభ్యులు, వీడీసీ సభ్యులు కనుగందుల ప్రశాంత్, రైతులు కుమ్మరి



రాజేందర్, ముచ్కూర్ నవీన్, రాగుల అశోక్, శ్రీనివాస్, గంగారాం పాల్గొన్నారు.

## డాక్టర్ వేణుగోపాలకృష్ణకు విశిష్ట కళారత్న పురస్కారం..

**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్:** ప్రముఖ వైద్యులు, నటులు, దర్శకులు, కవి, రచయిత డాక్టర్ వేణుగోపాలకృష్ణ చేస్తున్న సేవలకు గాను విశిష్ట కళారత్న,ఉత్తమ సామాజిక వేత్త పురస్కారం లభించింది.నిర్మల్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు పాటే మా ప్రాణం సంస్థలు ఈ పురస్కారాన్ని ప్రకటించారు.డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఇదివరకు ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారిగా,నిర్మల్ ఆర్ ఎమ్ ఓగా,ఖానాపూర్,ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా అత్యుత్తమ సేవలందించి ఎన్నో జాతీయ,రాష్ట్ర జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు.57 సార్లు రక్తదానం చేసి ప్రాణదాత బిరుదు పొందారు.వైద్యరత్న,వైద్యశిరోమణి,వైద్య డాక్టర్ వేణుగోపాలకృష్ణ కళారంగం లో ప్రేమతో నాన్న చిత్రానికి నంది పురస్కారాలు పొందారు.ఇప్పుడు విశిష్ట కళారత్న పురస్కారం.డాక్టర్ నీలిమ,కూతురు డాక్టర్ సుహాసిని తో కలిసి డాక్టర్ వేణుగోపాల కృష్ణ ఈ గౌరవాన్ని అందుకున్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య..

**ప్రజాపక్షం/ఖానాపూర్ :**ఖానాపూర్ పట్టణం శాంతినగర్ కాలనీకి చెందిన కోమటిపల్లి పోశెట్టి అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.ఎస్సై మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణ శాంతినగర్ కాలనీకి చెందిన పోశెట్టి గత ఐదు సంవత్సరాల నుండి టీబీ వ్యాధితో బాధపడుతున్నాడని,ఆ బాధలోనే మద్యాన్ని అలవాటు చేసుకున్నాడని,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోశెట్టి స్థానికంగా ఉన్న రైస్ మిల్లులో ప్రైవేట్ వర్కర్ గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని,తనకు వచ్చిన వ్యాధి గురించి ఎక్కువగా ఆలోచిస్తూ మద్యం అలవాటు చేసుకున్నాడని,అధిక మద్యం అలవాటు ఉండటం వలన ఎప్పటి లాగే ఆదివారం మధ్యాహ్నం కూడా ఎక్కువ మద్యం సేవించి ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయాడని,తను ఎటు వెళ్ళాడో తెలియక కుటుంబ సభ్యులు ఆదివారం నుండి వెతకగా సోమవారం ఉదయం పట్టణ శివారులోని గాంధీనగర్ నల్ల పోచమ్మ దేవాలయ సమీపంలోని అడివి ప్రాంతంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించరని తెలిపారు.మృతుడి భార్య చెప్పిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని రాస్తారోకో

**ప్రజాపక్షం/భైంసా:**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిర్మల్ జిల్లా భైంసా శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టాచు వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో 8900 కోట్ల స్కాలర్షిప్ పెండింగ్లో ఉంది గత తొమ్మిది సంవత్సరాలైనా కూడా ఈ యొక్క స్కాలర్షిప్లను విడుదల చేయడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు 3 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలని పరిస్థితి ఈ యొక్క తెలంగాణ రాష్ట్రంలో కనబడుతుంది.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్షిప్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేని ఎడల ఎంత ఉద్యమానికైనా వెనకాడ బోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఏబీవీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఢీ కొని పారిశుద్ధ్య కార్మికురాలు మృతి

**ప్రజాపక్షం/బోధన్:**ఆర్టీసీ బస్సు ఢీకొని బోధన్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికురాలు నాగమణి మృతి చెందిన ఘటన బోధన్ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు నాగమణి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం తెల్లవారు జామున 5:30 సమయంలో మున్సిపల్ విధి నిర్వహణలో భాగంగా పట్టణంలోని చౌరస్తాలో రోడ్డు శుభ్రం చేస్తున్న క్రమంలో సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి లింగంపల్లి వెళ్తుంది. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆర్టీసీ బస్సు కార్మికురాలు నాగమణిని ఢీ కొట్టింది. తీవ్ర గాయాల పాలైన నాగమణిని స్థానికులు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కార్మికురాలు నాగమణి మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ పై మృతురాలి కుమారుడు రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ వెంకట్ నారాయణ తెలిపారు.